# ప్లాస్టిక్ పిశాచి!

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా ప్రజలు ప్లాస్టిక్‌ను వినియోగిస్తూనే ఉన్నారు. 50 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించినప్పటికీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం, జీవీఎంసీ అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ప్లాస్టిక్ విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. దీంతో వీధులు, మురుగుకాలువలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. – సింధియా

- కానరాని నిషేధం
- విచ్చలవిడిగా వినియోగం
- పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- నామమాత్రపు దాడులతో మమ


మల్కాపురం ప్రధాన రహదారిపై ప్లాస్టిక్ వ్యర్థాలు

జీవ మనుగడపై దుష్ప్రభావం కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించడంలో నగర పాలక సంస్థ పూర్తిగా వైఫల్యం చెందిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం, ప్రకాష్‌నగర్, రామకృష్ణాపురం, గాంధీజీవీధి, మార్కెట్‌రోడ్, శ్రీహరిపురం, జనతాకాలనీ, అంబేడ్కర్‌కాలనీ, గుల్లలపాలెం వంటి పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగంతో పాటు విక్రయాలు కూడా యథేచ్ఛగా జరుగుతున్నాయి.

**ఎక్కడపడితే అక్కడే వ్యర్థాలు**

ప్లాస్టిక్ వ్యర్థాలు మురుగుకాలువల్లో వేస్తుండడంతో వర్షాలు పడితే కల్వర్టులకు అడ్డంగా చేరి మురుగునీరు రోడ్ల మీద పారుతోంది. రోడ్ల పక్కన పడేయడంతో కుప్పలుగా చేరి వీధులు డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయి.

**తూతూ మంత్రంగా దాడులు**

మల్కాపురంతో పాటు శ్రీహరిపురం, గాజువాక, మార్కెట్ వంటి ప్రాంతాల్లో ప్లాస్టిక్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నిషేధిత ప్లాస్టిక్, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వ్యాపారం కోట్లలో జరుగుతోంది. ప్రభుత్వం, అధికారులు అండదండలతో ఇది అంతా జరుగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


షిప్‌యార్డ్ క్రీడామైదానంలో ప్లాస్టిక్ వ్యర్థాలు

### ముంచుకొస్తున్న ముప్పు

ప్లాస్టిక్ వాడకం వల్ల భూతాపం పెరుగుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోని ఆహార పదార్థాలు తినడం వల్ల క్యాన్సర్‌కు దారితీస్తుందని, చర్మ వ్యాధులు, సంతానలేమి వంటి సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించినా మార్పు రావడం లేదు. మరోవైపు ఇంట్లో మిగిలిన ఆహారం, కూరగాయల వ్యర్థాలు ప్లాస్టిక్ బ్యాగులతో చెత్తకుండీల్లో వేయడం వల్ల మూగజీవాలు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి.


రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు

### చెత్త నిర్వహణలోనూ విఫలం

మల్కాపురంలో ప్లాస్టిక్ నిషేధంపై తూతూ మంత్రంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నా వాటి వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించడంలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే బేకరీలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఫ్యాన్సీ స్టోర్స్, కూరగాయల షాపుల్లో ప్లాస్టిక్ వాడకం జోరుగా సాగుతోంది. వీటిలో వేడి పదార్థాలు వేస్తే ప్లాస్టిక్ కరిగి అందులోని రసాయనాలు క్యాన్సర్ కారకాలుగా మారుతాయని వైద్యులు చెబుతున్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి



ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి. దొరికితే సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలి. మొదటి సారి దొరికితే రూ. 25 వేలు, రెండోసారి దొరికితే రూ. 50 వేలు, మూడోసారి దొరికితే షాపును సీజ్ చేస్తామని ప్రకటనలే తప్ప అమలు చేసిన దాఖలాలు లేవు. నిబంధనలు కఠినంగా అమలు చేసినప్పుడే సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకం తగ్గుతుంది. –లక్ష్మి, మల్కాపురం

### ప్రత్యామ్నాయంపై అవగాహన



ప్రజలు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ, నార సంచులు వాడేలా అధికారులు అవగాహన కల్పించాలి. వాటి మార్కెట్‌ను ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ పట్టుకుంటే ఫైన్ అనేలా నిబంధనలు కఠినతరం చేయాలి. ప్రజలు కూడా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలుసుకుని గుడ్డ, నార సంచుల వాడాలి. చేతిసంచులతో బజారుకు వెళ్లి అందులోనే కావాల్సిన వస్తువులు తెచ్చుకోవాలి. –మహేశ్వరి, శ్రీహరిపురం

### ప్రజల సహకారం అవసరం



ప్లాస్టిక్ నిషేధానికి ప్రజల సహకారం చాలా అవసరం. ప్లాస్టిక్ వల్ల రకరకాల వ్యాధులు వస్తున్నాయి. రోడ్లపై చెత్త పేరుకుపోతుంది. ప్లాస్టిక్‌ను తిని మూగజీవాలు చనిపోతున్నాయి. కాగితం కవర్లు, గుడ్డసంచుల వినియోగం పెంచుకోవాలి. చేతిసంచిని నామోషీగా కాకుండా బాధ్యతగా భావించాలి. అప్పుడే ప్లాస్టిక్ నిషేధం సంపూర్ణంగా అమలవుతుంది. –చిన్నారి, దుర్గానగర్

## క్లుప్తంగా

### గొల్ల బాబూరావును పరామర్శించిన మళ్ల


ఎంపీ బాబూరావు యోగ క్షేమాలు తెలుసుకుంటున్న మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును మంగళవారం వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పరామర్శించారు. ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. పలు రాజకీయ అంశాలను చర్చించారు. త్వరగా కోలుకుని తిరిగి ప్రజాజీవితంలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

### బాక్సింగ్‌లో మోహిత్ ప్రతిభ


ఆనందోత్సవంలో మోహిత్ శివసాయి

మల్కాపురం: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో మల్కాపురం ప్రాంతానికి చెందిన పల్లా మోహిత్ శివసాయి గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ బాక్సర్లు మోహిత్‌ను అభినందించారు. మల్కాపురంగొల్లవీధి ప్రాంతానికి చెందిన పల్లా మోహిత్ శివసాయి స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. రాజమండ్రిలో ఈ నెల 12,13,14వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి బాలుర బాక్సింగ్ పోటీల్లో( 30,32 కేజీల విభాగాల్లో ) విజేతగా నిలిచి బంగారు పతకం సాధించాడు.

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి


దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె కరపత్రం విడుదల


సమ్మె కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి

పరవాడ: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసి, వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి కార్మికులు చేయనున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలో సబ్‌స్టేషన్ వద్ద సమ్మె కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే క్యాడర్, ఒకే వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 22వ పీఆర్సీ ఎరియర్స్, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులు అందరికీ అన్‌లిమిటెడ్ వైద్య సౌకర్యం, కోటి రూపాయల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు చెల్లించాలని కోరారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలో ప్రైవేటీకరణ విధానాలను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.చంద్రశేఖర్, పి.అప్పారావు, బి.నరసింగరావు, ఎం.రమణారావు, కె.త్రినాథ్, జయరాజ్ పాల్గొన్నారు.

### వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



పెందుర్తి: చాతుర్మాస దీక్షల్లో భాగంగా స్థానిక వేంకటాద్రిపై మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా భక్తులు తులాభారం నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

## బుద్ధ ధ్యాన వనం ప్రారంభం


ధ్యాన వనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బౌద్ధ భిక్షువు అనాలియో, జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మర్రిపాలెం వుడాలేఅవుట్ రైతు బజారు సమీపంలోని గ్రీన్ బెల్టులో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధ ధ్యాన వనాన్ని మంగళవారం మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. బౌద్ధ భిక్షువు బంతేజి అనాలియో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు ఎన్ఏడీ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మర్రిపాలెం వుడాలేఅవుట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. జైభీమ్, ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యం అంటూ నినాదాలు చేశారు. బౌద్ధభిక్షువు అనాలియో మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించిన రోజున ధ్యాన వనం ప్రారంభించుకోవడం గర్వంగా ఉందన్నారు. అసమానతలు లేని సమాజమే లక్ష్యంగా బౌద్ధ ధర్మం విరాజిల్లిందని అన్నారు. జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ గ్రీన్ బెల్టు అభివృద్ధికి సహకరించిన అధికారులు, స్థానికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి దోహదపడే విధంగా వీటిని ఉపయోగించడం గర్వంగా ఉందన్నారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, బౌద్ధ మతస్తులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల్లో మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ


ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, ఉపాధ్యాయులు

దాబాగార్డెన్స్: ఈ నెల 11, 12 తేదీల్లో ఏయూ ఇండోర్ జిమ్నాజియం హాల్లో నిర్వహించిన ఏయూ అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి గెలుపొందిన విద్యార్థినులు సీహెచ్ ఊర్మిళ, టి.ప్రియమణి, హెచ్.ప్రవళిక, సీహెచ్ ప్రేమలత, స్పందన, లక్ష్మి, మోహనప్రియ, హాసిని, మేఘన, రోహిణి, కావ్య, స్రవంతిని అభినందించారు. కోచ్‌లు ఉమామహేశ్వర్, భగత్‌సింగ్ క్రమం తప్పకుండా శిక్షణ అందివ్వడంతో విజయం సాధించడంతో పాటు గెలుపొందిన టీమ్ నుంచి ప్రియమణి, ప్రవలిక, కావ్య, హాసిని ఈ నెల 27 నుంచి తమిళనాడులో నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం టీమ్‌కు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు.

## భారీ అన్నసమారాధన


అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి అల్లూరి సీతారామరాజుకాలనీలో వెలసిన దుర్గాదేవి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంగా సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ లక్ష్మణరావును సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


ఎయిర్ పోర్టు పర్యావరణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట: విశాఖ ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డ్రెయిన్ల ద్వారా మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఎయిర్‌పోర్టు పర్యావరణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో లారీ డ్రైవర్లు పారబోస్తున్న ఆహార పదార్థాల కారణంగా పక్షులు చేరి విమాన రాకపోకలకు ప్రమాదం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మేహాద్రిగెడ్డ, ఇతర గెడ్డ ప్రాంతాల్లో పూడిక, చెత్తను క్రమం తప్పకుండా తొలగించాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో నిర్మాణ సామగ్రి, చెత్తాచెదారం డంప్ చేయకుండా ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. సమావేశంలో ఎయిర్‌పోర్టు అథారిటీ, విశాఖపట్నం పోర్టు, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అత్యవసర కేసులనే 108కి రిఫర్ చేయాలి


సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతతో మాట్లాడుతున్న 108 జిల్లా మేనేజర్ సురేష్

మహారాణిపేట: అత్యవసర సమయంలో రోగుల్ని, క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు చేర్చే 108 వాహనాల సేవలు కొన్నిసార్లు తమకు అందట్లేదని ప్రజల ఆరోపణ. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ప్రధాన ఆస్పత్రులకు రిఫరల్ కేసులు అధికమవుతుండడం వల్లే ఈ జాప్యం నెలకొంటోందని 108 సిబ్బంది వాదన. హైరిస్క్ కేసులను మాత్రమే ఇలా తరలించాల్సి(ఐఎఫ్‌టీ) ఉన్నప్పటికీ కొన్ని సార్లు రోగుల ఒత్తిళ్లతో చిన్న చిన్న కేసుల తరలింపునకూ 108 అంబులెన్స్‌లను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచనల మేరకు 108 వాహన వ్యవస్థ జిల్లా మేనేజర్ ఎం.సురేష్‌కుమార్, పైలెట్లు, ఈఎంటీలు మంగళవారం గోపాలపట్నం సీహెచ్‌సీకి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతతో 108 జిల్లా మేనేజర్ సురేష్‌కుమార్ పలు అంశాలపై చర్చించారు. అత్యవసర కేసులను మాత్రమే ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయా వాహనాల పరిస్థితిని సురేష్ పరిశీలించారు. డాక్టర్ సుజాత సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో 108 వ్యవస్థ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

### సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం


సీపీఆర్‌పై విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: విశాఖపట్నంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీపీఆర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు సీపీఆర్ అత్యవసర దశల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలని సూచించారు. ఐఆర్‌సీఎస్ చైర్మన్ సి.బాలసతీష్ మాట్లాడుతూ రోగి ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్‌ను ఆయన ప్రశంసించారు. ట్రైనర్ డాక్టర్ పి.రామారావు ప్రత్యక్షంగా సీపీఆర్ చేసి చూపించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు, ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, ఎస్.వి.రామారావు, టి.రామకృష్ణ, సీహెచ్.సాయికృష్ణ పాల్గొన్నారు.

### మహిళా కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ విజిలెన్స్ డిపార్టుమెంట్, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖపట్నం పోర్టు అథారిటీ విజిలెన్స్ ఆఫీసర్ టీవీ శ్రీనివాసరావు విద్యార్థులకు విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా ఇష్యూస్ రిలేటింగ్ టు విజిలెన్స్ అండ్ ఫైట్ అగైనెస్ట్ కరప్షన్ అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎస్.అనురాధ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.అనూష, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

### లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

గాజువాక: గాజువాక ఆటోనగర్‌లో ఒక లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంనుంచి మిరాజ్ హుస్సేన్ (36) లారీలో గాజువాక ఆటోనగర్‌కు ఇటుకల లోడ్ తీసుకొచ్చాడు. ఆటోనగర్ నుంచి తుంగ్లాం వెళ్లేదారిలో లారీని పార్కు చేసి రాత్రికి లారీలోనే పడుకున్నాడు. అయితే ఉదయానికి మృతి చెంది ఉన్నట్టు గాజువాక పోలీసులకు సమాచారం అందింది. దీనిపై తమకు ఇప్పటివరకు ఎవరూ సంప్రదించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్టు తెలిపారు. ప్రస్తుతానికి ఎటువంటి కేసు నమోదు చేయాలేదని పేర్కొన్నారు.

## ఒత్తిడిని జయిస్తే ఆనందకర జీవితం


డాక్టర్ కిషోర్‌బాబును సత్కరిస్తున్న ప్రతినిధులు

సీతంపేట: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ అనేక రకాల సమస్యలతో విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారని ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ కిషోర్‌బాబు అన్నారు. నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ విశాఖపట్నం చాప్టర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'ఒత్తిడిని జయించే విధానం' పై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. నిజజీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని తేలికగా తీసుకోవాలన్నారు. చక్కని ప్రణాళికలతో స్థిరత్వంతో జీవిస్తూ మానసికంగా దృఢత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. అప్పుడే ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యవంతమైన జీవితంతో ఆనందంగా జీవించవచ్చన్నారు. పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే వారందరూ ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో చాప్టర్ ప్రెసిడెంట్ కె.వి.రావు, ఆచార్య సాంబశివరావు, శేషగిరిరావు, పి.భాస్కర్, శ్రీనివాస్, ఆర్.సుధాకర్, శ్రీరాములు, కృష్ణకుమార్, శివప్రసాద్, ఎస్‌వీఎస్ సుధాకర్ పాల్గొని డాక్టర్ కిషోర్‌బాబును సత్కరించారు.

## 'పశ్చిమ'లో కోటి సంతకాలకు శ్రీకారం


పశ్చిమ నియోజకవర్గం పరిధిలో తొలిసంతకం చేస్తున్న సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: పీపీపీ ద్వారా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా కట్టబెట్టాలనే కూటమి కుట్రను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. పేద మధ్య తరగతి వారికి మెడికల్ విద్యను దూరం చేసేందుకు ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. పీపీపీ విధానాన్ని రద్దు చేసి మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలనే డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పశ్చిమ నియోజకవర్గంలో మంగళవారం మళ్ల విజయప్రసాద్ తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల కార్యక్రమాన్ని బుధవారం నుంచి నియోజకవర్గంలో విస్తృతం చేస్తామన్నారు. వార్డు అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా వార్డు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని ఇంటింటికి వెళ్లి మెడికల్ కళాశాలలను పీపీపీకి ఇస్తే పేదలకు జరిగే నష్టాన్ని వివరించి సంతకాలు సేకరించాలని కోరారు.

### ● ఇది రోడ్డే!

ఫోకస్


ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గం దుస్థితి

జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గ్రామం నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే సీసీ మార్గం పూర్తిగా గుంతల మయంగా మారింది. దీంతో గ్రామస్తులు సమస్యను పోర్టు అధికారులకు వివరించడంతో స్పందించి రూ. 23 లక్షల వ్యయంతో సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు గత నెల శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే వర్షాల పడడంతో పనులు నిలిచాయి. మరలా చేపట్టే క్రమంలో విద్యుత్ విభాగ సిబ్బంది భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్లు అమర్చే పనుల్లో భాగంగా రోడ్డును ఓ వైపు తవ్వారు. ఇలా తవ్విన మట్టిని రోడ్డుపై నిర్లక్ష్యంగా డంప్ చేశారు. దీంతో వర్షాలకు ఆ మట్టి కరిగి సేవా మార్గంపై వచ్చి సీసీ రోడ్డు కాస్తా మట్టి రోడ్డులా మారింది. దీంతో ఆ మార్గాన ప్రయాణించే వాహనదారులు జారిపడుతున్నారు. ఇంకెన్నాళ్లీ కష్టాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –మల్కాపురం

## క్రమశిక్షణతో గొప్ప నాయకులుగా రాణింపు


ప్రసంగిస్తున్న రేపల్లె శ్రీరామారావు

మద్దిలపాలెం: యువతరం నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఓఎన్‌జీసీ సీజీఎం రేపల్లె శ్రీరామారావు సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మంగళవారం ప్రసంగించారు. నాయకుడిగా రాణించాలనుకునే వ్యక్తులు ముందుగా స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే వారు గొప్ప నాయకులుగా నిలుస్తారని చెప్పారు. క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ప్రధానమని సూచించారు. అబ్రహాం లింకన్, వివేకానంద జీవితాలను ఉదహరిస్తూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన నాయకత్వ లక్షణాలు వివరించారు. యువతరం భవిష్యత్ భారతావనిని ఉన్నతంగా తీర్చిదిద్దే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతోపాటు బహుముఖ ప్రజ్ఞ, నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం మాట్లాడుతూ మార్గనిర్దేశం చేస్తూ ఇతరులను ముందుకు నడిపించే వాడే నాయకుడిగా నిలుస్తాడని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీరామారావును కళాశాల తరపున సన్మానించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమ్మెకు సిటు మద్దతు

దాబాగార్డెన్స్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మె విజయవంతం చేయాలని సిటు విశాఖ జిల్లా కమిటీ విద్యుత్ కార్మికులకు విజ్ఞప్తి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత ఏడాదిగా అనేక దఫాలుగా ఈపీడీసీఎల్ పరిధిలో సీఎండీకి వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. చలో విద్యుత్ సౌధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం సమస్యలు పరిష్కరించకుండా కార్మికులు సమ్మెకు వెళ్లేలా చేస్తున్నాయని తెలిపారు. సమ్మె వల్ల ప్రజలకు జరిగే నష్టాన్ని నివారించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.